# నన్ను క్షమించరూ?

పెళ్లయిన యీ ఆరెన్నల్లలో అతను భార్యతో కటువుగా మాట్లాడటం ఇదే మొదటిసారి.

"అంత ఆలోచనా రహితంగా బాధ్యత తెలియకుండా ప్రవర్తించడమేమంత మంచిపనికాదు కరుణా!" ముంచుకొస్తున్న కోపాన్నణచుకుంటూ యింకా అక్కడే వుంటే ఆవేశంలో ఏవన్నా జరుగొచ్చునని, రాత్రి ఏడుగంటల వేళప్పుడు చెప్పులేసుకొని విసురుగా బయటికి నడిచాడు రవివర్మ. రవివర్మ స్వతహాగా ఆవేశపరుడు. చిన్న విషయాలకే కోపం తెచ్చుకుని గట్టిగా అరుస్తాడని వాళ్ళింట్లో అందరూ ఎరిగినదే. కాని, కరుణ అతని జీవితంలో ప్రవేశించిన నాటినుండి ఆ అమ్మాయి బాధ పడుతుందనేమో ప్రయత్న పూర్వకంగా ఆవేశాన్ని, కోపాన్ని తగ్గించుకున్నాడు. పెళ్ళయిన కొత్తలో వదినా, ఆడబిడ్డల ద్వారా అతని కోపాన్ని గురించి విని బెంబేలెత్తిపోయిన కరుణకు అతను ఎవరిని కోపగించినా తనదగ్గర శాంతంగా వుండడం చూసి కాస్త స్తిమితపడింది. ఆడబడుచులు కరుణను ఆటలు పట్టించాలంటే అనేది ఆమాటే.

నీటితో నిండిన విశాలమైన కళ్ళతో దిగులుగా శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది కరుణ. అసలింతకీ జరిగిన దేమంత విశేషం కాదు మామూలుగా చూస్తే, అన్నాలు తినేసి ఆరుబయట వెన్నెల్లో గాలిమేతకు పడే సమయంలో చటుక్కున గుర్తొచ్చింది కరుణకు రేపు ఉదయానికి బోర్నవీటా లేదని. అదే చెప్పింది భర్తతో, పొద్దున తేవడానికి ఆలస్యమవుతుందని, అప్పుడే తీసుకురావడానికి ఉద్యుక్తుడయ్యాడు రవివర్మ. తీరా డ్రాయరు తెరచి అందులో కావల్సిన డబ్బు లేకపోవడంతో కరుణ దగ్గరికే వచ్చాడు "డబ్బు తీశావా?" అంటూ. ఆవాళ నెలలో ముప్పయ్యో రోజని మర్చిపోయిన కరుణ అమాయకంగా అంది "ఊఁ!

కోల్డ్ క్రీమ్ అయిపోతే తెప్పించాను." అసలే శీఘ్రకోపియైన రవివర్మకు నిర్మలమైన ఆ సమాధానంతో ఆవేశం పెల్లుబికింది. "మంచిది! కోల్డ్ క్రీమ్‌తో రేపుదయం గడిపేసెయ్. బోర్నవీటాకు డబ్బు చాలదు." క్షణంలో రోషం, పౌరుషం కలిసికట్టుగా రాగా వుక్రోషంగా "అయితే క్రీమ్ అయిపోతే తెప్పించుకోవడం తప్పని తెలియదు నాకు. ఆమాత్రం స్వాతంత్ర్యం వుందనే అనుకున్నాను!" దూకుడుగా అంది కరుణ రాబోయే అనర్థానికి నాందిగా. ఎదురు జవాబు వచ్చేసరికి ఒళ్లు మరచిపోయాడు రవివర్మ. "అవునవును! అన్ని స్వాతంత్ర్యాలు యిచ్చే నెత్తికెక్కించుకున్నది. ఈనాటికి నా కష్టం, సుఖం పాటించకుండా ముప్పయ్యో తారీఖున వున్న డబ్బుతో కోల్డ్‌క్రీమ్ తెప్పించుకునేంత వివేకవంతురాలివయ్యావు" అంతే! ఆ, ఆవేశంతో వట్టిచేతులతోనే బయటికెళ్ళిపోయాడు. వడ్లగింజలో బియ్యపు గింజ కలహం... కాని... కాని...!

కరుణ మనసు ఈ సంఘటన నంత తేలికగా తీసుకోలేకపోయింది. చిన్నప్పటి నుండి ఎవరి దగ్గరా మాటపడకుండా పెరిగినదేమో హఠాత్తుగా యింకా కోపం వదలని భర్త నుండి యింత మాటపడేసరికి మనసంతా వికలమయింది. అసలే అభిమానవతియైన ఆమెలో క్షణంలో అహం రేకెత్తి హృదయమంతా వ్యతిరిక్త భావాలతో నిండిపోయింది.

"ఛ! ఈ మగవాళ్లే యింత! తన పదిహేడోఏట యింటర్ ఫస్టియర్ చదువు తున్నప్పుడు మొదటిసారిగా ముఖంమీద మొటిమలేస్తే స్నేహితురాళ్ళంతా "బుగ్గమీద గులాబి మొగ్గని" అన్నరోజులనుండి తను కోల్డ్ క్రీమ్ వాడుతూనే వుంది. ఈవాల్టికి ఈయనగారి దగ్గర మాట పడాల్సివచ్చింది. బుగ్గలమీదనుండి రెండు కన్నీటి బొట్లు టపటప రాలాయి ఎదురుగా అద్దంలోంచి కనబడుతున్న ముఖాన్ని చూస్తూ చెంపలు తడుముకుంది కరుణ దీనంగా! "ఛీ! పాడు బ్రతుకు తనదీ తొప్పే! ఇన్నాళ్లబట్టి ఎన్ని మందులు వాడినా తగ్గని మొటిమలకోసం చీవాట్లు తినాల్సి వచ్చింది. అందుకే... పెళ్ళి చేసుకోకూడదసలు. వీళ్ళ చెప్పుచేతుల్లో అన్నట్టల్లా పడుతూ, నవ్విస్తే నవ్వీ, ఏడిపిస్తే ఏడవటమేనా జీవితం? ఆర్థికంగా వాళ్ల మీద ఆధారపడబట్టికదా ఎంత మాటైనా వాళ్ళు సునాయాసంగా అనగల్గేదీ.... తాము పడి వూరుకునేదీను...! ఒక్కసారిగా అహంభావం రేగింది కరుణలో, "ఏం! ఈ మహానుభావుడు ఎమ్.ఏ., వెలగబెట్టి రెండు వందలతో ఒక పెళ్ళాన్ని సరిగ్గా పోషించలేనిది అంత పొగరుగావుంటే తనకేం? బి.యస్.సీ డిగ్రీ వున్న దానికి ఒక్క మనిషికి సరిపోయే జీతం రాకపోతుందా? ఆవేశంలో వచ్చిన అహంకారానికి మనసు వంత పాడింది అవునంటూ. "అంతే! మొహం చూపకుండా సంపాదించి ఖర్చు పెట్టుకుంటూ మీ లెక్కేమిటని వున్ననాడు ఈయన యిలాఅనగల్గేనా?"

తనకు తానే వేసుకున్న సంకెళ్ళలా మోకాళ్ళను చేతుల్తో చుట్టి, తల దానిమీద వాల్చి హృదయభారంతీరా ఏడ్చేసింది కరుణ. రాత్రి పది గంటలకు బోర్నవీటా టిన్నుతో వచ్చిన రవివర్మ మాట్లాడకుండా దాన్ని టేబులుమీదపెట్టి పడుకున్నాడు మౌనంగా, అతనికోపాన్ని తగ్గించే ప్రయత్నం చేయకపోగా, కరుణ అతని రాకను లెక్కజేయనట్టు ముభావంగా వుండిపోయింది. మరో మనిషి

వునికిని గమనించనట్టుగానే ఎవరి పనులు వారు ముగించుకుని రవివర్మ బయటకూ, కరుణ ఈజీ ఛైర్‌లోకి చేరుకున్నారు ఉదయం పది దాటేసరికి.

గదంతా పరికిస్తూంది కరుణ. వంటిల్లు కాక వున్నది ఈ ఒక్క గది, అదే డ్రాయింగ్ రూము, బెడ్‌రూము, డ్రెస్సింగ్ రూము అన్నీను. ఈ వూహలు నెమ్మదిగా కరుణను మళ్ళీ గత దినం తలపులోకి దింపాయి. చదువుకున్న వాళ్ళకి ఫాషన్స్ ఎక్కువని అంతా అనుకునే మాట. కానీ తనేమన్నా యింట్లోనే టెర్లిన్ శారీస్ కట్టాలనిందా... లేక రోజూ క్లబ్బులకు తిరగాలని కోరుకుందా? ఇక దేనికి తను అతని డబ్బు జల్సాగా ఖర్చు పెట్టింది? అన్నీ సుపీరియర్ కావాలని తనకేం ఆశలేదు. అలవాటు గనకనూ... అతని దగ్గర యింకా డబ్బు వుంటుందనే నమ్మకంతోనూ తెప్పించుకుంది. మొత్తం వున్నదంతా డ్రాయర్లో పెట్టాడని తనేం కలగనిందా? ఎంత తేలికగా అనగలిగాడు "బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నానని..." ఆ ముక్క తలచుకున్న క్షణంలో కరుణకు కన్నీళ్ళు వుబికి వచ్చాయి.

మళ్ళీ ఒకసారి మగజాతిని తిట్టుకుంది మనస్ఫూర్తిగా. అనురాగం, అనుబంధం, ఆప్యాయత అన్నిటి నిలువా ఆ నిముషంలో హుళక్కి అనిపించిందామెకు. తనకు తానే కల్పించుకున్న ఆమాయకమైన వూహగా, బూటకంగా కనిపించాయి. ఆలోచిస్తున్నకొద్దీ భర్త పరాయి వ్యక్తిగా, తనను కించపరచిన కఠినుడిగా స్పష్టంగా రూపుదాలుస్తున్నాడు కరుణ హృదయంలో... "ఛ ఛ! ఈ ఆడవాళ్లే యింత. ఎంత విముఖంగా వున్నా జాలితో కరిగిపోతారు నిముషంలో. ఆ జాలే తమనీస్థాయికి తెచ్చింది. వాళ్లకంత అధికారమిచ్చిందీనూ" టేబులుమీద ఎదురుగా దొంతర్లుగా పేర్చిన షేక్స్పియర్ సాహిత్యం కరుణ బేల తనాన్ని వెక్కిరిస్తున్నట్టుగా కనబడింది.

"ఈయనగారు పి. హెచ్. డి. వెలగబెట్టడానికి తను వూరుకాని వూరికి అందరికి దూరంగా ఇక్కడికి వచ్చింది... ఎందుకోసం? అతడు హోటలు కూడుతో బాధపడితే తనకేం? తోటలో తిరిగి టెర్రేస్‌మీద అల్లరిచేసే తను, ఒక్క గదిలో చాలీ చాలని రెండువందల్లో సంసారం సాగించడానికి సిద్ధపడి రావడం ఎవరి సుఖాన్నాశించి? పెళ్లయి సరిగ్గా ఆర్నెల్లు గడవకముందే యింత లోకువ అయితే యిక జీవితాంతం వరకు ఈ అధికారాన్ని, అహంభావాన్ని భరించడం దుర్భరమైన విషయం అవునుమరి! దేనినీ లెక్కజేయక అతనికోసం సర్వం ధారపోస్తుంటే హాయిగా నిర్లక్ష్యంగా వుండగలడు. అయ్యో! నాకోసంకదా ఈ అమ్మాయి పాటుపడుతున్నదన్న జాలి వుంటేకదూ? వేళకి వండిపెడితే రాజాలా తిని రీసెర్చి వర్క్‌లో మునిగిపోవడం తెల్సుగానీ... చుట్టూ కొత్త భాష, తెలియని మనుష్యులమధ్య ఒంటరిగా యిన్నిరోజులూ తనెంత బాధపడుతున్నదీ వూహకందదు కాబోలు!"

ఒకదాని వెంట మరొటిగా తరుముకొస్తున్న వూహలతో కరుణ మనసులో కోపం కరుగకపోగా పెరగసాగింది. రోజు రోజు యిద్దరి మధ్య గోడలేస్తూంది దృఢంగా, రవివర్మ తన

ఆవేశానికి కించపడుతున్నా, క్షమ నర్థించలేక లోలోపల పశ్చాత్తాపంతో పరితపిస్తున్నాడు. మాసిన గడ్డం, ఆలోచనా ధీనమైన చూపులూ, నిరుత్సాహంగా వుండే అతడ్ని చూస్తే ఒకోక్షణం కరుణ మనసు ద్రవించిపోతుంది. కాని, క్షణంలో హృదయాన్నదుపులోకి తెచ్చుకుంటుంది. నిర్లిప్తంగా వీధులన్నీ తిరిగి తిరిగి యింటికి చేరిన రవివర్మకు శూలాల్లాటి కరుణ చూపులు ఎదురవుతున్నాయి. అతని నుండి సుదూరతీరాలకు స్వేచ్ఛా ప్రపంచానికి ఎగిరిపోవాలన్న కరుణ ఆవేదన అతని కెలా అర్థమవుతుంది?

ఒకరోజు... గదంతా వెదికినా కన్పించని దువ్వెన కోసం చికాకుగా అల్మారాలోని పుస్తకాలన్నీ విసురుగా క్రిందపడేసింది కరుణ. పేజీలు రెప రెపలాడుతూ సగానికి తిరగబడ్డ భర్త డైరీని చూసి విస్తుబోయిందామె. "అతని కెన్నడూ పేజీల నిండుగా రాసే అలవాటులేదే" కుతూహలం సంస్కారాన్ని కొంచెం పక్కకు పెట్టగా వంగి డైరీ తీసుకుని కుర్చీలో కూర్చుంది కరుణ జడ మాట మరచిపోయి.

సెప్టెంబర్ 2 :

ఆవేశంలో కరుణను కోపగించాను. పాపం! ఎంత బాధపడిందో పిచ్చి కరుణ! అయినా నాకీకోపమేమిటి? తగ్గించుకోవాలి. అనవసరంగా తాత్కాలికోద్రేకంలో సున్నితమైన కరుణ మనసు నొప్పించాను. తను బాధపడుతుంటే చూస్తూ వుండడం నావశం కాదు" 3.. కరుణ నాతో మాట్లాడ్డంలేదు. నిజంగా కోపం వచ్చినట్టుంది. మామూలుగా మర్చిపోయి పలుకరిస్తుందనుకున్నాను. కానీ చాలా ఫీలయిందిలా వుంది. ఛ! అంతా నాదే తప్పు. నాకోసం అందరికీ దూరంగా వచ్చేసిన కరుణను నొప్పించిన నాకేం శిక్ష విధించుకోను? 10... కరుణ సాధారణంగా నామీద కోపగించదు. ఎంత బాధపడితే యిన్నిరోజులు సాధిస్తుంది? నేను నొచ్చుకుంటానని తన గురించి ఏ కష్టాన్నీ చెప్పదు. సినిమాలు, షికార్లు, సరదాలు ఏవిలేకున్నా నన్ను ఉత్సాహంగా వుంచడానికి ప్రోత్సహించే కరుణను ఏవిధంగానూ సుఖ పెట్టలేకపోగా, యింత కఠినంగా ఎలా ప్రవర్తించగలిగాను? దీనికి పరిష్కారమేవిటో ఆగమ్యగోచరంగా వుంది. 15.. మరీ యిన్ని రోజులా సత్యాగ్రహం? అనురాగాన్నందించే కరుణ దిగులుగా, కోపంగా, మౌనంగా వుంటే నాకు చదువెలా సాగుతుంది? చదువుమీద దృష్టి పోవడంలేదు. 17.. మరీ అంత పెంకితనం, మొండిపట్టు కూడదు. కరుణ నాకోసం కష్టపడుతోందని నేనింతగా బాధపడుతున్నాను గానీ అసలు ఎవరి కోసం వచ్చాను పి.హెచ్.డికి? కరుణ ఈ కోర్సంటే మోజుపడుతుందని తెలిసి ఆ అమ్మాయి కోసం కాదూ యింతా ప్రయత్నించి హాయిగా చేస్తున్న లెక్చరర్ ఉద్యోగం వదులుకుని చాలని జీతంతో యింతదూరం వచ్చింది? 18... ఇవ్వాల్టికి పద్దెనిమిది రోజులు. యింకా మాట్లాడకపోవడమేమి న్యాయం? నేనంత కూడని తప్పుమాట ఏమన్నాను? కొంచెం ఆలోచించి ఖర్చు చేయాలన్నాను అంతేగా! నిజం చెప్పాలంటే కరుణ దుబారా మనిషే. అంత చిన్న మాటకింత పౌరుషం రానక్కరలేదు. అన్నం తినకుండా కంచం ముందునుండి లేస్తున్నా ఎందుకని

అడగదు నేనెంత నీరసంగా నిస్పృహగా వుంటే తనకెందుకు! ఛ! జీవితమంటేనే విసుగ్గా వుంది. ఇంకా ఎందుకీ రీసెర్చి? ఎవరి ఆనందం కోసం? ఎలాగూ పూర్తికాదు యిటువంటి నిర్లిప్తతలో. వదిలేసి పారిపోతే నా విలువ తెలుస్తుందామెకి? ఎక్కడికి? జీవితంనుండి! అంతే. అదే చివరి గమ్యం జీవితంలో శాంతికరువైనప్పుడు..."

ఏడ్చి వుబ్బిన కళ్లతో, బుగ్గలమీద ఎండిన కన్నీటి చారలతో, హృదయ భారం తీరేమార్గంలేని కరుణ, డైరీ గుండెలమీద పెట్టుకుని ఆమెకే తెలికుండా ఎప్పుడో నిద్రపోయింది.

పర పర పేజీలు చింపి, ముక్కలు చేసి మంటలోకి విసిరేస్తున్నాడు రవివర్మ. అతని ముఖంలో ఏ భావం వ్యక్తం కావడంలేదు... ఆవేశం, క్రోధం విచారం, నిస్పృహ ఏవీకూడా కానరావడం లేదు. సర్వసంగ పరిత్యాగిలా తన ప్రాణాధికమైన పుస్తకాలు చేజేతులా అగ్నికాహుతి చేస్తున్నాడు నిర్వికారంగా. పైకి...పైపైకి మంట రాజుకుంటూంది. మింటికందుకోవాలని మిడిసిపడుతూంది. ఉత్సాహంగా తాండవ మాడుతున్నాడు అగ్నిదేవుడు. హామ్లెట్ మంట కాహుతి అయింది. రోమియో జూలియట్‌లు నుసిగా మరారు. ఒథెల్లో మండిపోయింది. అన్నీ... అన్నీ.. సర్వనాశనం! కారణం నేనే..." కెవ్వుమని భయంగా అరుస్తూ కలత నిదురనుండి మేల్కొంది కరుణ. "ఎవరు తన కాలంబనగా నిల్చింది? ఇంకా తన నాదుకుంది ఎవరు?"

"కరుణా! కరుణా! భయపడ్డావా? పీడకల వచ్చిందా? సంధ్యపడే వరకు నిద్రే? కన్నీటి చారలేమిటి? ఇంకా మాట్లాడవా? కరుణా? కోపమా? నన్ను..." అనురాగం, ఆవేదన ప్రార్థన దీనత్వం అన్నీ వున్నాయి రవివర్మ ప్రశ్నలలో... పలుకుల్లో! కరుణ నెమ్మదిగా అంది "నన్ను క్షమించరూ?" అని.

సంధ్య స్నేహంకోరి చంద్రుడు వెలిగాడు కోటికాంతులతో, తారలు దూర దూరంగా పారిపోయాయి. వెన్నెలకాంతి సుతారమైన స్పర్శకు కలువ కన్నె వికసించి చెలికాడినిచూసి మెల్లగా నవ్వింది. విరగ బూసిన మల్లెలు కోరిన మలయ పవనునికి సుగంధాలందించాయి అందరికీ పంచిపెట్టమని. కరుణ రవివర్మల మనసుల్లో మల్లెల మాలలు...

**"శశిరేఖ" మాస పత్రిక**

తేది : డిసెంబర్, 1972.